
మాట్లాడుతున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

రవనీత్‌సింగ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై కేంద్రమంత్రి రవనీత్‌సింగ్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ డిమాండ్ చేశారు. గురువారం దూలపల్లిలో ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒక ప్రజా నాయకుడిని పట్టుకొని టెర్రరిస్టు, భారతీయుడు కాందంటూ ఆరోపణలు చేసిన బీజేపీ నాయకులను వెంటనే పార్టీ నుంచి, పదవుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి వారిని క్యాబినెట్ నుంచి తప్పించాలని అన్నారు. గాంధీ కుటుంబం దేశప్రజల కోసం ఎంతో సేవ చేసిందని, అలాంటి వారిని దూషించే హక్కు బీజేపీ నాయకులకు లేదని మండిపడ్డారు. రాహుల్‌గాంధీపై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పకుంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బండి రమేష్, పక్కన పట్నం సునీతా మహేందర్‌రెడ్డి

ఉద్యమకారుడు మాధవరెడ్డికి ఘన నివాళి

ఓల్డుబోయినపల్లి/ కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): తొలిదశ తెలంగాణ ఉద్యమకారుడు సింగిరెడ్డి మాధవరెడ్డిని తెలంగాణ ప్రజలు మర్చిపోలేదని మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. మాధవరెడ్డి 15వ వర్ధంతిని ఆయన తనయుడు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం గౌడవెల్లి మాధవరెడ్డి చౌరస్తా వద్ద నిర్వహించారు. మాధవరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధానకార్యదర్శి కొప్పిశెట్టి దినేష్‌కుమార్, గంధం రాజు కూడా పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు వేణు, డివిజన్ నాయకులు మహిళా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గణనాథున్ని దర్శించుకున్న సునీతా మహేందర్‌రెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టెంపుల్ బస్టాపులో ఏర్పాటుచేసిన గణనాథున్ని మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పట్నం సునీతామహేందర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆమె వెంట కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సతీష్ రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ ఉన్నారు.

ప్రజలు, మేధావులు జమిలి ఎన్నికలను వ్యతిరేకించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూసుఫ్

జీడిమెట్ల,సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలు రాష్ట్రాల స్వయం ప్రతిపత్తికి విఘాతం కలిగిస్తాయని సీపీఐ జాతీయ సమితి సభ్యులు యూసుఫ్ అన్నారు. గురువారం జీడిమెట్లలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రధాన సమస్యలపై ప్రజల దృష్టి మరల్చి రాష్ట్రాలకు గల స్వయం ప్రతిపత్తిని ఎత్తివేయాడానికి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. జమిలి ఎన్నికలను మేధావులు, ప్రజలు వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇక 'హైడ్రా' కుత్బుల్లాపూర్‌లో ఒక చోట మాత్రమే కూల్చివేతలు చేపట్టి చేతులు దులుపుకున్నది ఆయన్న ఆయన, చెరువులను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యమంలో నియోజకవర్గం కార్యదర్శి ఉమామహేష్, స్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్


కార్పొరేటర్ రవీందర్‌రెడ్డిని గృహనిర్బంధం చేసిన పోలీసులు

బాలానగర్/రాయదుర్గం/ పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు పూర్తిగా రుణమాఫీ చేయలేని సీఎం రేవంత్‌రెడ్డికి.. కేసీఆర్ భయం పట్టుకుందని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. రుణమాఫీ కాని రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ చలో ప్రజాభవన్ ముట్టడికి పిలుపు నిచ్చింది. అప్రమత్తమమైన బాలానగర్ పోలీసులు వినాయకనగర్‌లో కార్పొరేటర్ ఆవుల రవీందర్ ఇంటి వద్దకు వెళ్లి ఆయనను గృహనిర్బంధం చేశారు. రైతాంగ సమస్యలపై పోరాడుతున్న బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కార్పొరేటర్ అన్నారు. రైతులందరికీ పూర్తిగా రుణమాఫీ చేసే వరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్ పార్టీని విడిచిపెట్టే ప్రసక్తే లేదన్నారు. రేవంత్ సర్కార్ ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతూనే ఉంటామన్నారు. కొంపెల్లిలో బీఆర్ఎస్ నాయకులు పోలీసులు ముందస్తుగా గృహనిర్బంధం చేశారు. కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్నా శ్రీశైలం యాదవ్, మేడ్చల్ సొసైటీ చైర్మన్ సింగిరెడ్డి రణదీప్‌రెడ్డి, గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్మన్ మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు జయపాల్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, నాయకులు ఉదయభాస్కర్‌రెడ్డి, బాలరాజ్, సాయినాథ్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరి శెట్టి సాయిబాబాను రాయదుర్గం పోలీసులు గురువారం తెల్లవారు జామున 5 గంటలకు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రోడ్లపై గుంతలకు మరమ్మతులు చేయండి

షాపూర్‌నగర్, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా చేపట్టిన పనులతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గాజులరామారం డివిజన్ హెచ్ఏఎల్ ఈస్ట్‌కాలనీ 3,4వ వీధుల్లో ఆరు నెలల క్రితం పైపులైన్ కోసం రోడ్లను తవ్వారు. డ్రైనేజీ పైపులైన్ వేసిన అధికారులు, రోడ్లపై గంతలకు మరమ్మతులు చేపట్టలేదు. చిన్నపాటి వర్షానికి రోడ్లు బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని, సంబంధిత అధికారులు రోడ్లపై గుంతలకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

'స్వచ్ఛత సేవలో భాగస్వాములు కావాలి'

దుండిగల్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని దుండిగల్ మున్సిపల్ వైస్‌చైర్మన్ టి. పద్మారావు సూచించారు. గురువారం మున్సిపల్ పరిధిలోని దొమ్మర పోచంపల్లి 8వ వార్డు బస్తీ దవాఖానా వద్ద పరిసరాలలో చెత్తను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం ప్లకార్డులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతహీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు కమిషనర్ సత్యనారాయణ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు స్థల పరిశీలన

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్‌లోని హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు కాలనీ వాసులతో కలిసి విద్యుత్ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. కాలనీలో ఉన్న టాన్స్‌ఫార్మర్‌లో హై ఓల్టేజీ కారణంగా విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు వస్తున్నాయని కాలనీ అధ్యక్షుడు సిద్ధిరాములు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. గురువారం కాలనీలో పర్యటించిన అధికారులు త్వరలోనే టాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. స్థలం పరిశీలనలో విద్యుత్ అధికారులు శ్రీనాథ్‌రెడ్డి, అనీల్ కుమార్, శివప్రసాద్, రమేష్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

చెత్త సేకరణలో చేతులెత్తేశారా?

- నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని రాజీవ్ గృహకల్పలో రోడ్లపైనే చెత్త
- వృద్ధి చెందుతున్న దోమలు, ఈగలు

రోగాల బారిన ప్రజలు


రాజీవ్ గృహకల్పలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తచెదారం

నిజాంపేట్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చుచేసి నగరంలో స్వచ్ఛ భారత్‌పై అధికారులు ప్రజలు అవగాహన కల్పిస్తున్నా పెద్దగా మార్పు కనిపించడం లేదు. ఇంటింటికి తడి పొడి చెత్తను సేకరించే సిబ్బందిని ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోయింది. పలు కాలనీలు, బస్తీల ప్రజలు ఇళ్లల్లోని చెత్తను పాలిథీన్ కవర్లలో తీసుకొచ్చి రోడ్ల పక్కన వేస్తున్నారు. దాంతో ఆయా మార్గాలు మొత్తం దుర్వాసన వెలువడుతుంది. ఇది నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప దుస్థితి. కార్పొరేషన్ పరిధిలో పలు డివిజన్లలోనూ చెత్త సేకరణలో అధికారులు చేతులెత్తాశారా అని స్థానికులు మండిపడుతున్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గుట్టలుగా పేరుకుపోయిన చెత్త వల్ల ఈగలు, దోమలు వృద్ధి చెంది, ప్రజలు రోగాలా భారిన పడుతున్నా అధికారులకు మాత్రం కనువిప్పు కలుగడం లేదు. రోజూ ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించే సిబ్బంది సక్రమంగా పనిచేయకపోవడంతో కార్పొరేషన్‌లోని పలు డివిజన్లు మురికికూపంగా మారుతున్నాయన్నారు. స్కూల్ వెళ్లే విద్యార్థులు, పాదచారులు, వాహనదారులు రోడ్లపై ముక్కుమూసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని, అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో పర్యటించి చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డంపింగ్ యార్డుగా రాజీవ్ గృహకల్ప



రాజీవ్‌గృహకల్ప ప్రాంతం మొత్తం చెత్త పేరుకుపోయి డపింగ్‌యార్డ్‌గా మారింది. అధికారులు కాలనీల్లో పర్యటించి, చెత్త వేసే స్థలాన్ని గుర్తించి, ఆ ప్రాంతంలో చెత్త వాహనాన్ని ఏర్పాటు చేయాలి

- రచ్చ చక్రధర్, మేడ్చల్, మల్కాజ్‌గిరి బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి

ఈపీఎస్ పెన్షన్‌దారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి


కార్యాలయం ఎదుట వ్యక్తం చేస్తున్న బీఎంఎస్ నాయకులు

బాలానగర్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ఎంప్లాయిస్ పెన్షన్ స్కీం(ఈపీఎస్)పై కేంద్ర ప్రభుత్వం ఆవలంబిస్తున్న తీరును నిరసిస్తూ కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని పీఎఫ్ కార్యాలయం ఎదుట గురువారం ఉదయం బీఎంఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో కార్మికులు కాషాయ జెండాలతో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ 2014 నుంచి ఈపీఎస్‌పై కేంద్ర ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల కనీస వేతనాన్ని రూ.5 వేలకు పెంచాలని, ఈపీఎస్ పెన్షన్‌కు డీఏను జతచేయడం, ఈపీఎస్ పెన్షన్ దారులకు ఆయుష్మాన్ భారత్‌ను వర్తింప చేయడం, సుప్రీం కోర్టు ఆదేశాల మేరు హైయ్యర్ పెన్షన్‌ను కార్మికులకు త్వరితగతిన అందజేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అనంతరం పీఎఫ్ కమిషనర్‌కు కార్మికులు నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలిండియా పబ్లిక్ సెక్టార్ ఫెడరేషన్ జనరల్ సెక్రెటరీ రావుల వెంగళ్‌రావు, జయేందర్‌గౌడ్, సుబ్బారావు, మల్లేశం, శ్రీధర్, రమేష్, హెచ్ఏఎల్, హెచ్ఎంటీ, రాణీ ఇంజన్ వాల్వ్ కంపెనీ, ఉషాకంపెనీ ఓక్రిడ్జి స్కూలు, సీనియర్ సిటిజన్ ఫోరమ్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, హిల్టన్ టొబాకో, నేచర్ క్యూర్ ఆసుపత్రి, సంరక్షణ ఎలక్ట్రికల్స్ తదితర పరిశ్రమలో పని చేసే కార్మికులు కార్మిక నాయకులు పాల్గొన్నారు.


ఓల్డుబోయినపల్లిలో మిలాద్ ఉన్ నబీ ప్రార్థనలలో ఎమ్మెల్యే కృష్ణారావు


కుత్బుల్లాపూర్‌లో కూన శ్రీశైలంగౌడ్


ఓల్డు బోయినపల్లి డివిజన్‌లో కార్పొరేటర్ నర్సింహ్మాయాదవ్, బీఆర్ఎస్ నాయకులు

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు

శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మాధవరం, మాజీ ఎమ్మెల్యే కూన


చంద్రగిరినగర్‌లో విజయ్‌రామిరెడ్డి హుస్సేన్, ఇస్మాయిల్, శివ తదితరులు


సాయినగర్‌లో జులూస్ తీస్తున్న ముస్లింలు

జీడిమెట్ల/నిజాంపేట/ఓల్డుబోయినపల్లి, సెప్టెంబర్19(ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా గురువారం జీడిమెట్ల, ఓల్‌బోయిన్‌పల్లి, నిజాంపేట, గాజుల రామారం డివిజన్‌లలో భక్తిశ్రద్ధలతో ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. బాచుపల్లి సాయినగర్‌లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా వేడుకలకు హాజరైన కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు. చింతల్ డివిజన్ రోడామిస్త్రీనగర్, మసీద్ అక్సా, జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్, దేవేందర్‌నగర్ వేడుకల్లో పాల్గొన్న శ్రీశైలం గౌడ్ ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఓల్డుబోయినపల్లిలో ఈద్గాల వద్ద జరిగిన మిలాద్ ఉన్ నబీ వేడుకలలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మాయాదవ్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం వారికి మిలాదున్ నబీ శుభాకాంక్షలు తెలిపారు. ఓల్డుబోయినపల్లి డివిజన్ కాంగ్రెస్ మైనారిటీ నాయకుడు అస్లాం ఆధ్వర్యంలో చేపట్టిన జులూస్‌లో కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ పాల్గొన్నారు. గాజులరామారం డివిజన్ చంద్రగిరినగర్‌లో మిలాద్ ఉన్ నబీ వేడుకలలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు విజయ్‌రామిరెడ్డి హుస్సేన్, ఇస్మాయిల్,శివ, రవికిరణ్, సుమన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

22న గాయత్రీనగర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

అల్లాపూర్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్, గాయత్రినగర్ కాలనీలో ఈ నెల 22న సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఫోరం అధ్యక్షుడు హరిబాబు తెలిపారు. ఆదివారం గాయత్రినగర్‌లోని సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ బిల్డింగ్, వాటర్‌ట్యాంక్ పార్కు రోడ్డులో డా.మాధవీస్ ఐ హాస్పిటల్‌తో సంయుక్తంగా ఉచిత క్యాంపును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

23న లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు స్కీమ్‌లను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వవద్దని, ప్రభుత్వమే బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలను అందజేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం భవననిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద మరణం, సహజ మరణం, శాశ్వత అంగవైకల్యం, పాక్షిక అంగవైకల్యం నాలుగు సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించి తమ బాధ్యతల నుంచి తప్పుకోవాలని ప్రయత్నిస్తుందన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఈనెల 23న లేబర్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తెలిపారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.కోటంరాజు, గౌరవ అధ్యక్షుడు ఓంగోలు రాములు తదితరులు మాట్లాడారు.

'మియాపూర్ డివిజన్ అభివృద్ధికి కృషి'

మియాపూర్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ అభివృద్ధి నిరంతరం కృషి చేస్తానని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ కాలనీ, శ్రీలక్ష్మీనగర్‌కాలనీ అసోసియేషన్ సభ్యులు గురువారం కార్పొరేటర్‌ని కలిసి అభివృద్ధి పనులు చేపట్టాలని వినతిపత్రాన్ని అందజేశారు. అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డు పనులను చేపట్టాలని, తాగునీటి సదుపాయాన్ని మెరుపర్చాలని కోరారు. భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులనూ చేపట్టాలని కోరారు. అధికారుల దృషికి తీసుకువెళ్లి సాధ్యమైనంత త్వరగా పనులు చేయిస్తానని వారికి కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

అనాథాశ్రమంలో అన్నదానం

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): సేవ్ ఏలైఫ్ సేఫ్టీ ఫర్ హ్యూమానిటీ సంస్థ ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ మైత్రి చిల్డ్రన్స్ హోం, ఆల్విన్‌కాలనీలోని రాజరాజేశ్వరి వృద్ధాశ్రమంలో సంస్థ వ్యవస్థాపకులు సూరగాన రాణాప్రతాప్ పాల్గొని అన్నదానం చేశారు. అమెరికా న్యూజెర్సీ శరత్, సుభాషిణి ఆర్థిక సహకారంతో చేసినట్లు పేర్కొన్నారు.

బస్సు సడన్‌బ్రేక్‌తో కిందపడి విద్యార్థినికి గాయాలు

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయగా ఓ విద్యార్థిని కింద పడి గాయపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈసీఎల్ బీరంగూడకు చెందిన సిహెచ్ రమేష్‌గౌడ్ కుమార్తె కీర్తన మేడ్చల్ జిల్లా మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజనీరు కళాశాలలో సీఎస్ఇ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. రోజు మాదిరిగానే మైసమ్మగూడలో తోటివిద్యార్థులతో కలిసి ఆర్టీసీ బస్సు ఎక్కింది. డ్రైవర్ అతివేగంతో బస్సును నడిపి సడెన్ బ్రేక్ వేయడంతో విద్యార్థిని కిందపడగా, కాళ్లపై నుంచి బస్సు వెళ్లడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. గాయపడిన కీర్తనను సైరారంలోని నారాయణ హృదయాలయం ఆస్పత్రిలో చేర్పించారు. కీర్తన తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన వినాయక నిమజ్జనాలు

పద్మనగర్‌లో పూజలు చేసిన మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ


సర్వే సత్యనారాయణకు శాలువా కప్పి సన్మానిస్తున్న నిర్వాహకులు

ఓల్డుబోయినపల్లి/షాపూర్‌నగర్/మియాపూర్, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): ఓల్డుబోయినపల్లి బోయిన్ చెరువు వద్ద ఉన్న కొలనులో గణనాథుల నిమజ్జనం ముగిసింది. కుత్బుల్లాపూర్ పద్మనగర్ రింగ్ రోడ్డులో యువకులు ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ అవిజే జేమ్స్, అమర్‌బాబు, జానయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. హఫీజ్‌పేట్ గ్రామం హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద గురువారం గణేశుడి లడ్డూకు నిర్వాహకులు వేలం పాట నిర్వహించారు. రూ. 7.02 లక్షలకు శ్రీవిజయలక్ష్మీ జువెలర్స్ అధినేతలు మొలుగు వెంకటేష్‌చారి రవికుర్‌చారి, హరికుమార్‌చారి సొంతం చేసుకున్నారు. నిమజ్జన ప్రశాంతంగా ముగియడంతో జీహెచ్ఎంసీ సిబ్బంది వ్యర్థాలను తొలగించే పనిలో పడ్డారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది నిమజ్జనానికి వచ్చిన విగ్రహాల సంఖ్య తగ్గిందని అధికారులు చెబుతున్నారు. జీహెచ్ఎంసీ, పోలీసుశాఖ, రాంకీ, ఇంజనీరింగ్, వాటర్ వర్క్స్, విద్యుత్‌శాఖ అధికారుల సమన్వయంతో నిమజ్జనం ప్రశాంతంగా పూర్తవ్వడం తమకెంతో తృప్తి నిచ్చిందని అధికారులు వెల్లడించారు.


లడ్డూని సొంతం చేసుకున్న శ్రీవిజయలక్ష్మీ జువెలర్స్ అధినేతలు

అనారోగ్య సమస్యలతో గృహిణి ఆత్మహత్య

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని గృహిణి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రెయిన్‌బో విస్టాలో నివాసం ఉంటున్న బాపట్ల రాధాకుమారి(41) అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య చేసుకుందని ఆమె తండ్రి లింగాల వెంకటశాస్త్రి ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసులు గురువారం కేసు నమోదు చేసుకున్నారు. తన కుమార్తెకు పెళ్లికి ముందే స్కిజో ఫెనియా వ్యాధి రావడంతో చికిత్స అనంతరం తగ్గింది. 17 ఏళ్ల క్రితం శివ సూర్యవెంకట దీక్షిత్‌తో పెళ్లి చేశామని మృతురాలు తండ్రి తెలిపాడు. అనంతరం వ్యాధి తిరగబెట్టగా వివిధ ఆస్పత్రుల్లో చికిత్స అందించినా తగ్గలేదన్నారు. మానసికంగా బాధపడుతూ నేను ఆత్మహత్య చేసుకుంటానని పలుమార్లు బెదిరించిందని వివరించాడు. ఈనెల 18న ఆరోగ్యం బాగోలేదని భర్తకు చెప్పి చైల్డ్ బెడ్రూంలోకి వెళ్లింది. మీ కుమార్తెను హాస్పిటల్‌లో చేర్పిద్దాం మీరు రండి అని అల్లుడు తనకు చెప్పాడన్నారు. పని ముగించుకొని రాత్రి 10.45 ఇంటికి వెళ్లగా బెడ్రూం లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. డూప్లికేట్ తాళంతో డోర్ తెరిచి చూడగా ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కనిపించింది. 108కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి యశోదా ఆస్పత్రి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. మా కుమార్తె మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని ఆయన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఆటో

చికిత్స పొందుతూ ఆస్పత్రిలో ఒకరు మృతి

హైదర్‌నగర్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిని వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కూకట్‌పల్లి ఎల్లమ్మబండలో నివాసం ఉండే బాషవేని తిరుపతి(47) స్వరూప దంపతులు మాదాపూర్‌లో ఓ కంపెనీలో పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం ద్విచక్రవాహనంపై భార్యాభర్తలు వెళ్తుండగా కేపీహెచ్‌బీ కాలనీ పిల్లర్ నంబర్ 733 వద్ద ఆటో అతివేగంతో ద్విచక్రవానాన్ని ఢీకొట్టింది. తీవ్రగాయాల పాలైన తిరుపతి, స్వరూపలను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. బుధవారం రాత్రి తిరుపతి మృతిచెందారు. భార్య స్వరూప చికిత్స పొందుతుంది. గురువారం మృతుడి కుమారుడు మేఘచందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోల్డ్ మెడల్స్ సాధించిన గుర్రాల చోరీ

మాదాపూర్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): రేసుల్లో పాల్గొని గోల్డ్ మెడల్స్ సాధించిన రెండు రేసింగ్ గుర్రాలు చోరీకి గురయ్యాయి. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ కేసు వివరాలు ఇలా ఉన్నాయి. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాకతీయ హిల్స్‌లో హార్స్ రైడింగ్ అకాడమీలో ఐదు గుర్రాలు ఉన్నాయి. గుర్తుతెలియని దుండగులు ఈ నెల 12న బంగారు పతకాలు సాధించిన రెండు గుర్రాలను చోరీ చేశారు. అకాడమీ నిర్వాహకుడు ఖాజా మొయినుద్దీన్ ఫిర్యాదు మేరకు మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జీడిమెట్ల పోలీసుల కర్కశత్వం

దొంగతనం నెపంతో థర్డ్ డిగ్రీ ప్రయోగం


బాధితుడు రామునాయక్

జీడిమెట్ల, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పోలీసులు ఉన్నతాధికారుల ఆదేశాలను ధిక్కరించి ఓ వ్యక్తిపై తమ కర్కశత్వాన్ని ప్రదర్శించారు. షాపూర్‌నగర్‌లో నాలుగురోజుల క్రితం దొంగతనం నెపంతో పోలీసులు థర్డ్‌డిగ్రీ ప్రయోగించడంతో చేయివిరిగిపోయిందని బాధితుడు బోరున విలపిస్తున్నాడు. తనకున్యాయం చేయాలని, పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి అన్యాయంగా చెయ్యి విరగొట్టిన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాడు. భద్రాచలం- కొత్తగూడెం జిల్లాకు చెందిన రామునాయక్(38) నగరానికి వచ్చి షాపూర్‌నగర్‌లో ఉంటూ కూలీగా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆదివారం సాయంత్రం షాపూర్‌నగర్ కల్లుకాంపౌండ్‌లో కల్లు తాగటానికి వెళ్లాడు. అక్కడ సోను, వడ్డెర రాము అనే ఇద్దరు వ్యక్తులు మరో వ్యక్తిని కొట్టి డబ్బులు తీసుకుంటుండగా మధ్యలో వెళ్లి ఆపేందుకు యత్నించాడు.ఈ క్రమంలో కల్లుకాంపౌండ్ నిర్వాహకులు 100కు డయల్‌చేయడంతో జీడిమెట్ల పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మధ్యవర్తిగా ఉన్న రామును కూడా స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఫోన్, డబ్బులు నీవే తీశావని రామునాయక్‌పై థర్డ్‌డిగ్రీ ప్రయోగించారు.దీంతో రాము చేయి విరిగిపోయింది. కూలిచేసుకునే బతికే నన్ను చితకబాది,చేయి చేయి విరగొట్టారని, ఆస్పత్రికి వెళ్లటానికి కూడా డబ్బులు లేక ఇంట్లోనే కూర్చున్నానని బాధితుడు వాపోతున్నాడు. అన్యాయంగా తనను చిత్రహింసలు పెట్టిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నాడు.

రాము పాతనేరస్థుడు: సీఐ మల్లేష్

ఈ ఘటనపై జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా రాము అనేక పేర్లతో చలామణి అవుతున్నాడని, ఇతను పాత నేరస్థుడని గతంలో అనేక కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని తెలిపారు. దొంగతనం చేసి కూడా కేసు పెడితే చచ్చిపోతానని బెదిరిస్తున్నాడని పేర్కొన్నారు. నిత్యం షాపూర్‌నగర్ కల్లు కాంపౌండ్ వద్ద అల్లరి చేస్తుంటాడని తెలిపారు.